క్లుప్తంగా

కొఠారీలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



కంచిలి: శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ దుక్క ధనలక్ష్మి ప్రారంభించారు. వైద్యులు ఎ.రమ్యారెడ్డి, దేవేంద్రరెడ్డి, అనూష రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ముంగిట్లోకి వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పెద్దశ్రీరాంపురం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 322 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. స్పెషలిస్ట్ డాక్టర్‌తోపాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రోగులను పరీక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్, పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, తలగాన రుద్రమూర్తి, మార్పు నీలకంఠం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

మందస: మూలిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తెలుకుల గురుమూర్తి ఇటీవల చనిపోయారు. దీంతో అతని కుటుంబాన్ని ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ గుసిరి వెంకటరావు మంగళవారం పరామర్శించారు. గురుమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య లక్ష్మి, కుమారులు జగన్నాథరావు, కృష్ణారావులను ఓదార్చారు. పార్టీ నాయకులు దడ్డ కిరణ్‌కుమార్, పిట్ట కృష్ణారావు, భీమారావు, గుసిరి నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ తెలుకుల మురళీ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వెలుగు సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: సంఘ సభ్యులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల అధ్యక్షులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వయంశక్తి సంఘాల గ్రేడింగ్, మొబైల్ బుక్ కీపింగ్, ఆన్‌లైన్ అకౌంట్, వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, పెరటి తోటల పెంపకం, ఉన్నతి రుణాల కోసం కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఆరోగ్య పోషణ రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ ఆరోగ్య పోషణ కార్యక్రమంలో భాగంగా అయోడైజ్డ్ ఉప్పు వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ, గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో అధ్యక్షురాలు డి.పార్వతి, సీసీలు మోహనరావు, లక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులకు ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



చిన్నారులకు సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడంతో 2, 4 తరగతులు చదువుతున్న పిల్లలు శరణ్య, లిఖితలు అనాథులుగా మిగిలిపోయారు. ఇటీవల 'సాక్షి'దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' శీర్షికన కథనం ప్రచురించడంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. మంగళవారం 2018 డీఎస్సీ తెలుగు పండిట్ సేవాదళ్ తరపున చిన్నారులకు 7,100 రూపాయల నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులను అందజేశారు. సాయం చేసిన వారిలో ఉపాధ్యాయులు జి.శంకరరెడ్డి, ఎల్లారావు, జి.కృష్ణ, శ్రీహరి, నాగిశెట్టి మల్యాద్రి, గేదెల శంకరరెడ్డి, ఆర్,కె.బాబు ఉన్నారు.

హామీలను నెరవేర్చని కేంద్రం

పలాస: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రంలోని బీజేపీ సర్కార్ తుంగలో తొక్కిందని రాష్ట్ర రైతాంగ నాయకుడు కోనారి మోహనరావు అన్నారు. పలాసలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 16వ తేదీన చేపట్టనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఎ.ఐ.కె.ఎం.ఎస్ నాయకుడు మద్దిల రామారావు, సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకుడు తామాడ సన్యాసిరావు, పోతనపల్లి కుసుమ, పిన్నింటి నాగేశ్వరరావు, చాపర వేణు, వినోద్ ఉన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం..

- గ్రామీణుల ఆరోగ్యానికి భరోసా
- సత్ఫలితాలిస్తున్న 104 వాహన వైద్య సేవలు

ఇది కదా.. అభివృద్ధి



వైద్యసేవలందిస్తున్న 104 వాహన సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ప్రజా వైద్యానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోనూ వైద్య సిబ్బంది 30 రకాల వైద్యారోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో వాహనాల ద్వారా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌సీ, ఆశ వర్కర్లు, నర్సులు వైద్య సేవలు అందించడంతోపాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు.

వాహనాల వివరాలు..

కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో రెండేసి 104 వాహనాలు ఉండగా, ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఒక వాహనం ద్వారా సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నెల 15,290 మందికి 104 వాహనాల ద్వారా వైద్య సేవలు అందినట్లు సిబ్బంది తెలిపారు..

ఈసీజీ సేవలు సైతం..

ప్రతి 104 వాహనంలో వైద్యాధికారి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఉంటారు. గుండెకు సంబంధించిన రోగులకు ఈసీజీ పరీక్షలు కూడా చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రథమ చికిత్సలు నిర్వహించి, ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

ఆస్పత్రి ఖర్చులు తగ్గాయి



ఐదేళ్లుగా బీపీ, సుగర్ వ్యాధితో బాధపడుతున్నాను. దీనికి తోడు వృద్ధాప్యం దగ్గర పడుతుండటంతో ప్రతి నెల మా గ్రామానికి వచ్చే 104 వాహన సిబ్బంది పైసా ఖర్చు లేకుండా వైద్యం చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. గతంలో వైద్యం కోసం ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి వెళ్లాల్సి వచ్చేది. నెలకు వైద్యం కోసం సుమారు రూ. వెయ్యి ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చులు తగ్గాయి.

– బుడువు గున్నమ్మ, కొఠారీ, ఇచ్ఛాపురం మండలం

అందుబాటులో 30 రకాల వైద్య సేవలు



104 వాహనం ద్వారా 30 రకాల వైద్య సేవలను అందిస్తున్నాం. నేరుగా గ్రామాలకు వెళ్లి ఆశ కార్యకర్తల ద్వారా ప్రచారం కల్పించి వైద్యం చేస్తున్నాం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకుంటున్నారు. సుగర్, బీపీ, థైరాయిడ్, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నాం.

– డాక్టర్ వై.కల్యాణ, వైద్యాధికారి, కొళిగాం పీహెచ్‌సీ, ఇచ్ఛాపురం మండలం

అల్లుడు..గిల్లుడు నిజం కాదా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బెల్లాల శ్రీనివాసరావు తదితరులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ అల్లుడు వెంకన్న చౌదరి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలను వేధించడం, ప్రైవేటుగా ట్యాక్స్‌లు వసూలు చేయడం నిజంకాదా అని వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పలాసలోని మంత్రి సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శ్యామసుందర శివాజీ తన అల్లుడు వెంకన్న చౌదరితో అనుమతి లేకుండానే వివిధ వర్గాల నుంచి ట్యాక్స్‌లు వసూలు చేయించడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రతి వ్యాపారిని ఇబ్బందులు పెట్టడంతోపాటు వ్యక్తిగత కక్షలు పెట్టుకుని కేసులు పెట్టించిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. వెంకన్న చౌదరి మాట వినకపోతే వ్యాపారస్తుల ఇళ్లు, పరిశ్రమలపై ఏసీబీతో దాడులు చేయించిన ఘనత కూడా అల్లుడిదే అని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్తకులు భయాందోళన చెందిన సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో డాక్టర్ సీదిరి అప్పలరాజు వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన అనంతరం వర్తకుల సమస్యలను పరిష్కరించారన్నారు. టీడీపీ హయాంలో వంద అడుగులకు కేటీ రోడ్డు విస్తరణకు అనుమతి వచ్చినప్పటికీ ఆ పార్టీ నాయకులు పనులు చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. ఎమ్మెల్యే అప్పలరాజుకు వర్తకులు తమ సమస్యలు తెలియపర్చగా రోడ్డును 80 అడుగులకు విస్తరించడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చారన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏసీబీ దాడులు, ట్యాక్సులు, వ్యక్తిగత కక్షలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, మంత్రి సీదిరి అప్పలరాజుకు అండగా వర్తకులు నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి తూముల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజల వద్ద నుంచి ధ్యాన్యం డబ్బులు, రుణాలు, సబ్సిడీలు, బ్యాంకుల నుంచి సుమారు రూ.7 కోట్లను శివాజీ అల్లుడు సహకారంతో ఓ టీడీపీ నాయకుడు తినేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆ నాయకులు ప్రజలను ఉద్ధరిస్తామని ప్రెస్‌మీట్లు ఏర్పాటు చేసి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైశ్య యువకుడు ఆత్మహత్యకు కారణమైన టీడీపీ నాయకులను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. తిత్లీ తుపాన్ పరిహారంతో పాటు ఇతర పథకాల్లో లక్షలాది రూపాయలను తినేసిన టీడీపీ నాయకుల అవినీతిని త్వరలో బయటపెడతామన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు సహకారంతో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటామన్నారు. సమావేశంలో పలాస ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్, కొంచాడ శ్రీకాంత్, కాశీబుగ్గ వైశ్య సంఘ కార్యదర్శి కోట్ని విజయ్, పెంట రత్నాకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

- సామాజిక తనిఖీల్లో బయటపడిన వైనం
- రికవరీకి అధికారుల ఆదేశం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

పలాస: మండలంలోని వివిధ గ్రామాల్లో గత ఏడాది జరిగిన ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతి జరిగినట్టు అధికారులు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది. పలాస ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్‌ను మంగళవారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు సంబంధించిన పనులపై అంశాల వారీగా చర్చ జరిగింది. లొత్తూరులో రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రజావేదిక సోషల్ ఆడిట్ బృందం బయటపెట్టింది. ఇక్కడ పని చేసిన సిబ్బంది నుంచి రూ.1.30 లక్షలు రికవరీ చేయాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు ఆదేశించారు. 19 పంచాయతీల్లో మస్తర్లపై సంతకాలు లేకుండా వేతనదారులకు బిల్లులు చెల్లించినట్టు గుర్తించామని స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటరావు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.65 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, సీసీ రోడ్లు, కాలువలు, నీటి గుంటలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ.. అర్హులందరికీ పనులు కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. మస్తర్ల నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారి డి.లవరాజు, క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్ బాబు, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీవో శంకరరావు, ఈసీ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి– బైపల్లి గ్రామస్తుల చిరకాల కల నెరవేరింది. రెండు గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.9 లక్షలు మంజూరయ్యాయి. దీంతో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ నాయకులు లండ రామలింగం, మద్దు రాంప్రసాద్ మంగళవారం భూమి పూజ చేశారు. మంత్రి సీదిరి అప్పలరాజు కృషితో రోడ్డు సమస్య పరిష్కారం అవుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మద్దు సుధీర్, మద్దు సత్యం, కోనేరు కామేశ్వరరావు, పి.చంద్రశేఖర్, బి.ధనరాజు, కె.శేఖర్, కె.వెంకటస్వామి, ఎల్.కృష్ణ, పి.ధనరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె.చిట్టిబాబు, ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు, స్థానిక సర్పంచ్ లండ లక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్ పాల్గొన్నారు.

టెక్కలి ఎస్సైగా లక్ష్మి



టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా నియమితులైన కె.లక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్సైగా పని చేస్తూ బదిలీపై వచ్చారు.

తెప్పలకు లయన్స్ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస లయన్స్ క్లబ్‌కు చెందిన డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ప్రతిష్టాత్మక లయన్స్ పురస్కారం దక్కింది. విశాఖలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ లయన్స్ పూర్వ అధ్యక్షుడు లయన్ ఫ్రాంక్ జె.మోరీ, జిల్లా 316–ఏ గవర్నర్ లయన్ డాక్టర్ ఎ.గోపాలరావు చేతుల మీదుగా కృష్ణమూర్తికి ప్రొగ్రెసివ్ మెల్విన్ జోన్స్ ఫెలో పురస్కారంతో సత్కరించారు. పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రోణంకి హేమాచలంతో పాటు సభ్యులు కృష్ణమూర్తికి అభినందనలు తెలియజేశారు.

వారి హయాంలో అభివృద్ధి శూన్యం

- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

కోటబొమ్మాళి: కింజరాపు కుటుంబీకుల హయాంలో ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కోటబొమ్మాళి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నూక సత్యరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లేశ్వరరావు అన్నారు. కింజరాపు కుటుంబీకుల స్వగ్రామం నిమ్మాడ పక్కనున్న హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్‌ను కూడా కనీసం అభివృద్ధి చేయలేకపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహననాయుడు ఓటమి ఖాయమన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దువ్వాడ శ్రీనివాస్‌ను అధిష్టానవర్గం ప్రకటించడంతో బాబాయ్, అబ్బాయిలకు చెమటలు పడుతున్నాయన్నారు. అందుకే నాలుగున్నరేళ్లుగా కనిపించకుండా పోయిన వారిద్దరూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో తిరుగున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం



నర్సింగరావును సత్కరిస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: తిలారు పీహెచ్‌సీలో గ్రేడ్–2 ఫార్మాసిస్టుగా పనిచేసి గ్రేడ్–1 ఫార్మాసిస్టుగా పదోన్నతిపై విజయనగరం మహారాజ ఆస్పత్రికి బదిలీపై వెళ్తున్న బమ్మిడి నర్సింగరావును సిబ్బంది మంగళవారం సత్కరించారు. ఆయన చేసిన సేవలను పీహెచ్‌సీ డాక్టర్ మెండ మణీషా, డాక్టర్ బి.మురళి కొనియాడారు.

సీఎం జగన్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



దూగానపుట్టుగలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. దూగానపుట్టుగ పంచాయతీ, కవిటి మేజర్ పంచాయతీ కేంద్రాల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. కవిటిలో జెడ్పీ నిధులు రూ. ఐదు లక్షలతో చేపట్టనున్న జగన్నాథస్వామి ఆలయ మండపానికి, బెహరా వీధిలో త్రినాథస్వామి ఆలయ మండపానికి శంకుస్థాపన చేశారు. అలాగే దూగానపుట్టుగ గ్రామ పంచాయతీ మహంకాళిపుట్టుగలో రూ. ఐదు లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని, అదే గ్రామం పెట్ట వీధిలో రూ. 2.5 లక్షల మండలపరిషత్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే పంచాయతీలో రూ.1.70 లక్షల జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మించిన మంచినీటి బోరుమోటార్‌ను, అదే పంచాయతీ పరిధి కొటియావీధిలో పంచాయతీ నిధులు లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, పూడి నీలాచలం, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, దుగానపుట్టుగా సర్పంచ్ దుగాన భద్రాచలం, బద్రి ప్రకాష్, నర్తు శివాజీ, దుద్ది సతీష్, దుద్ది ధర్మారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



బ్రోచర్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. కవిటి–1 గ్రామ సచివాలయంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా కవిటి బస్టాండ్ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పాలన వ్యత్యాసాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వై.నీలయ్య, కవిటి ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, మానెక శంకర్ ప్రధాన్, నాయకులు దుద్ది ధర్మారావు, బెందాళం జయప్రకాశ్, పాండవ శేఖర్, నారాయణ స్వామి, బి.నాగభూషణం, పిన్నింటి జయరాం, వై.అశోక్, సంతోష్ బెహార, దువ్వు కృష్ణారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీలో కోదండ రామస్వామి దేవాలయం నుంచి మంగళవీధి వరకు రూ. 40 లక్షల రూర్బన్ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో రహదారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్, జేఈ రమేష్, పార్టీ నాయకులు సిర్మా, కోళ్ల తిరుపతి, కింతలి భీమా, పిట్ల సంతోష్, మంగి బుజ్జి, దొండపాటి శ్రీను, వెంకన్న, ఈపరి రవి, జక్కం రమేష్ ఉన్నారు.

పలు పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సాయిరాజ్, నిమ్మన దాస్

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ మంగళవారం భూమి పూజ చేశారు. రూ. 40 లక్షల రూర్బన్ నిధులతో కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, సమావేశ మందిర భవనాల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించి, శిలాఫలకం ఏర్పాటు చేశారు. అలాగే రూ. 20 లక్షల రూర్బన్ నిధులతో మండల పరిషత్ కార్యాలయం నుంచి కొత్త పేట వరకు 230 మీటర్ల సీసీ రహదారి నిర్మాణానికి భూమి చేశారు. సోంపేట మేజర్ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్టు నాయకులు చెప్పారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్, సర్పంచ్‌లు పొందూరు గున్నయ్య, బట్టి మాధవరావు, పార్టీ నాయకులు కొంచాడ నెహ్రూ, వజ్జ కృష్ణ, తామాడ మోహనరావు, కోట్నీ శ్రీనివాసరావు, సూరాడ పాపారావు, జక్కం ఉదయ్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

భక్తి శ్రద్ధలతో బల్ల పండుగ

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన రజకులంతా బల్ల పండుగను మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏటా సంక్రాంతి తరువాత రజకులంతా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. డప్పు వాయిద్యాలతో గ్రామదేవత కిల్లిపోలమ్మ గుడికి వెళ్లి ముగ్రాటలతో చల్లదనం చేశారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

మందస: హంసరాళి పంచాయతీ పరిధి మందవూరు గ్రామానికి సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మహేంద్రతనయ–మెళియాపుట్టి రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మించనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయ కులు, మాజీ సర్పంచ్ గౌడు కురా, నాగేశ్వర బృందావన్, నాగేశ్వర జయరాం, పినకాన రాజేంద్ర పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

టెక్కలి: ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారి టి.శ్రీకన్య అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విద్యార్థులకు పైథాన్‌పై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆమె పరిశీలించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు యు.డి.ప్రసన్న, ఏపీ ఎస్ఎస్‌డీసీ స్కాక్ డైరెక్టర్ వి.అశోక్‌కుమార్ ఉన్నారు.

గురుకుల విద్యార్థులకు తీరిన దాహార్తి

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చాలా కాలంగా బోరు మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు మంచినీటి అవసరాలు తీర్చుకోవడం కోసం అవస్థలు పడ్డారు. దీన్ని గుర్తించిన ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి స్పందించారు. మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలు మంజూరు చేసి బోరు, మినీ వాటర్ స్కీమ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌ను ఎంపీపీ దేవదాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఎంఈవో–2 కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

భగవాన్‌పురంలో అధికారుల దర్యాప్తు

టెక్కలి: భగవాన్‌పురంలో మంగళవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు దర్యాప్తు నిర్వహించారు. తనకు చెందిన 30 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన పొన్నాడ బాబూరావు, అప్పలస్వామి తదితరులు ఆక్రమించారంటూ గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజు ఇటీవల ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో గతంలో అధికారులు సర్వే నిర్వహించి స్థలం తనకు చెందినదిగా సర్వే రిపోర్టు ఇచ్చినప్పటికీ తన స్థలాన్ని ఖాళీ చేయడం లేదని మరోసారి అధికారులను ఆశ్రయించారు. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామంలో దర్యాప్తు నిర్వహించి వివరాలు సేకరించారు.

వైఎస్సార్ బీమాతో భరోసా

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ బీమా కష్టాల్లో ఉన్నవారికి భరోసా ఇస్తోందని కంబారాయుడుపేట సర్పంచ్ వంక చిరంజీవి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో వాసుపల్లి హేమలత మృతి చెందారు. ఈమెకు మంజూరైన రూ.90 వేలను మృతురాలి సోదరి సంధ్యకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, గ్రామ పెద్దలు లండ జంగమయ్య, నీలయ్య, శ్రీను, వార్డు మెంబరు బాపనమ్మ, వలంటీర్ డి.రాజేష్ పాల్గొన్నారు.